విశిష్టం.. మహాశివరాత్రి పర్వదినం

- ఘనంగా ముస్తాబవుతున్న శైవాలయాలు
- శివరాత్రి పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, కల్యాణం
- భక్తుల రద్దీ దృష్ట్యా ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీలు, అధికారులు



పెనగలూరు: వేపచెట్టు మొదలులో వెలసిన శివాలయం



నిత్యపూజ స్వామి మూలవిరాట్



ఒంటిమిట్ట: భైరవేశ్వర స్వామి మూలవిరాట్

సిద్దవటం : నిత్యపూజ స్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిత్యపూజ స్వామిని దర్శించుకునేందుకు వైఎస్సార్ జిల్లా నుంచే కాకుండా కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. శివరాత్రి ఉత్సవాల్లో, కార్తీక మాసంలో మూడవ సోమవారం శివ పార్వతుల ప్రతిమలకు కల్యాణం, ఊరేగింపు నిర్వహిస్తారు. సంతానం లేని మహిళలు నీటి గుండాల్లో స్నానాలు చేసి తడిబట్టలతో ఆలయం ముందు వరపడుతుంటారు. భక్తుల సౌకర్యార్థం లారీలు, బస్సులు, ట్రాక్టర్లు, ఆటోలు, సుమోలు తదితర వాహనాలు తిరుగుతుంటాయి. కొందరు భక్తులు పంచలింగాల గుడి వద్ద దారి పొడవున అన్నదాన కార్యక్రమం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తుంటారు.

బోడ మల్లేశ్వరస్వామి ఆలయంలో..

పెనగలూరు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈటమాపురం పంచాయతీ తూర్పుపల్లి గ్రామం వద్ద వెలసివున్న బోడమల్లేశ్వరస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. మహా శివరాత్రికి తెల్లవారుజాము నుంచే వేదపండితులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు, స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గుర్రయ్య తెలిపారు. అలాగే ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రత్యేకంగా భజన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోనే సాయిబాబా, శ్రీకృష్ణ ఆలయం, నవగ్రహాలు, వినాయక, కామాక్షమ్మ ఆలయాలు ప్రత్యేకంగా ఉన్నాయన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు అన్ని దేవాలయాలలో పూజలు చేసుకునే అవకాశం బోడ మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశామన్నారు. అలాగే భక్తులకు కొలను సౌకర్యం కల్పించామన్నారు. భక్తులు విరివిగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి, అమ్మవార్ల కృపను పొందాలని కోరారు.

శివరాత్రికి 35 ప్రత్యేక బస్సులు

రాజంపేట : రేపు శివరాత్రి సందర్భంగా రాజంపేట డిపో నుంచి గుండాల కోనకు 10, తలకోనకు 10, అత్తిరాలకు 15 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు రాజంపేట డిపో మేనేజర్ రమణయ్య తెలిపారు. ప్రత్యేక బస్సు సౌకర్యాలను ప్రజలు వినియోగించుకోవాలని రాజంపేట డిపో మేనేజర్ కోరారు.

రేపు భైరవ కోనలో శివరాత్రి ఉత్సవం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని పెన్నపేరూరు గ్రామం సమీపంలో ఉన్న భైరవ కోనలో వెలసిన భైరవేశ్వర స్వామికి రేపు(శనివారం) శివరాత్రి సందర్భంగా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు గురువారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు రాత్రి శివ పార్వతుల కల్యాణం ఉంటుందని తెలిపారు.

మట్టి శివలింగాల పంపిణీ

రాయచోటి టౌన్ : గ్రామాలలోని శివాలయాలకు పార్థవ(మట్టి) శివలింగాలను హరిహర శారదలక్ష్మి పురం వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. గురువారం సాయంత్రం రాయచోటి ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినూకల రవీంద్రస్వామి మాట్లాడుతూ హరిహరపురం పీఠాధిపతి 2012- 2014 మధ్య కాలంలో గ్రామాలలో ధర్మప్రచారం నిర్వహించారని చెప్పారు. ఆయన మహా సంకల్పంతో 32 పార్థవ లింగాలకు పూజలు నిర్వహించి ఆ మట్టితో తయారు చేసిన శివలింగాలను ఆయన తిరగాడిన ఆలయాలకు (మట్టి శివలింగాలు) అందజేస్తున్నామన్నారు. వీటిని మహాశివరాత్రి రోజున ఆలయాల వద్ద ఉంచి పూజలు నిర్వహించి అదే రోజు నదిలో నిమజ్జనం చేయాలని చెప్పారు. ఇలా చేయడం వలన పవిత్రత సంతరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రతిభ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శివగంగిరెడ్డి, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి (పార్థవ) శివలింగాలను అందజేస్తున్న ధర్మ పరిచారకులు

నాణ్యమైన వైద్యం అందేలా చూడండి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ ఆస్పత్రులలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయనే నమ్మకాన్ని కలిగించాలని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, ఆస్పత్రి కమిటీ ప్రధాన సభ్యుడు బేపారి మహమ్మద్ ఖాన్‌తో కలసి ఆయన రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న రోగులతో మాట్లాడారు. వైద్యంపై, ఆస్పత్రిలో అందిస్తున్న భోజనంపై అడిగి తెలుసుకున్నారు.

నేడు కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం

గాలివీడు : మండల కేంద్రంలోని ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో నేడు శుక్రవారం గ్రామ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల సమావేశంలో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పాల్గొనున్నట్లు ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ యదుభూషణ్ రెడ్డిలు తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొనాలని వారు కోరారు.

క్లుప్తంగా

ఘనంగా మిట్టపల్లి గంగమ్మ జాతర



మొక్కులు చెల్లిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : గంగమ్మ జాతరను మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక మండపంలో అమ్మవారిని కొలువుదీర్చారు. పసుపు, కుంకుమ, గాజులు, కొత్త వస్త్రంతో, పూలమాలలతో సుందరంగా గంగమ్మతల్లిని అలంకరించి, భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు చేశారు.

కాలిన మామిడి చెట్ల పరిశీలన



కాలిన చెట్లను పరిశీలిస్తున్న రెవెన్యూ, ఉద్యానవన శాఖాధికారులు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ గరుగుపల్లె గ్రామంలో ఆకతాయిల చేష్టలతో కాలిన మామిడిచెట్లను గురువారం తహసీల్దార్ ఆదేశాలతో రెవెన్యూ, ఉద్యానవన శాఖాధికారులు పరిశీలించారు. 40 మామిడి చెట్లు పూర్తిగా, సగానికి పైగా పది మామిడిచెట్లు కాలినట్లు అధికారులు గుర్తించారు. నష్టం నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు. దెబ్బతిన్న తోటలకు చెందిన రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శీనునాయక్, వీఆర్‌ఓ మల్లీశ్వరి, హెచ్‌ఓ అధికారులు శివ, వీఆర్‌ఓ చిన్న, బాధిత రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసం ఇష్టపడి చదవండి



విద్యార్థులతో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ మహబూబ్ బాషా

లక్కిరెడ్డిపల్లి : పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాల కోసం విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని కస్తూర్బా గురుకుల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మహబూబ్ బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ వంటను పరిశీలించి నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డించాలని సిబ్బందికి సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి ఏ గ్రేడ్ వచ్చేటట్టు ప్రయత్నించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చక్రీనాయక్, ఇన్‌చార్జ్ ఎస్‌ఓ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రజకులను ఆదుకోవాలి

రాయచోటి అర్బన్ : కులవృత్తిపై ఆధారపడి నానాకష్టాలు పడుతూ జీవిస్తున్న రజకులను ప్రభుత్వం అన్ని రకాలుగా రాయచోటి రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, వీరబల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం తమ సంఘం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆదుకోవాలని రజక వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న తమవారికి దేవాలయాల్లో ఉపాధి కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వాసుపత్రులలో బట్టలు ఉతికే అవకాశాన్ని రజకులకు కాకుండా ఇతరులకు ఇవ్వడం తగదన్నారు. రజకుల జీవనోపాధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కులవృత్తి నిర్వహణలో భాగంగా అవసరమైన యంత్ర పరికరాలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీ కింద నిధులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు ఎం.వి.రమణ పాల్గొన్నారు.

మంచి నడవడిక ఉన్నవారే ఉత్తములు

గుర్రంకొండ: సమాజంలో మంచి నడవడిక ఉన్నవారే ఉత్తములని జమాతే ఇస్లామి హింద్ జిల్లాశాఖ అధ్యక్షులు ఆజమ్ ఆలీఖాన్ అన్నారు. గురువారం పట్టణంలోని పలువురు ప్రముఖులను కలుసుకొని మానవత – నైతికత అన్న అంశంపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతియుతంగా జీవించడం అలవరుచుకోవాలన్నారు. ప్రతి మనిషి నైతిక విలువలు కలిగి ఉండాలన్నారు. సమాజంలో మానవత్వం ఉన్న మనిషి అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సయ్యద్ హఫీజ్, ఎండీ అబ్దుల్లా, నయాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించండి

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



ముఖ్య నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మేడా

రాజంపేట : ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలోని ఆరు మండలాలు, రాజంపేట మున్సిపాలిటీలోని ముఖ్య నేతలతో గురువారం రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి తన పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వివిధ వ్యూహాలను, పార్టీ నేతలతో అనుసరించాల్సిన విధానాలను ఎమ్మెల్యే ముఖ్య నేతలతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా ఇవ్వాలని తెలిపారు. అందుకు సంబంధించి పార్టీలోని ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పోలి సుబ్బారెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ చిదానంద గౌడ్, రాయవరం సర్పంచ్ రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలగిరి మల్లికార్జునరెడ్డి, సుండుపల్లి మైనారిటీ నాయకులు రెహమాన్ ఖాన్, మనుబోలు వెంకటసుబ్బయ్య, మందారం గంగిరెడ్డి, భీమరాజు, సత్యాల రామకృష్ణ, మురళీ ఆచారి, మస్తాన్, శివయ్య, కొరముట్ల హరి, వెంకీ పాల్గొన్నారు.

భోజన మందిరానికి భూమి పూజ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కోనరాజుపల్లి పంచాయతీ అమ్మవారిపల్లిలో గురువారం "శ్రీ సీతారాముల భోజన మందిరానికి" రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భోజన మందిరం నిర్మాణానికి స్వయంగా తానే టీటీడీ వారితో మాట్లాడి రూ. 10 లక్షలు మంజూరు చేయించానన్నారు. ప్రజలకు, భక్తులకు ఉపయోగపడే పనుల కోసం తాను ఎప్పుడు ముందుంటానని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గెడ్డం జనార్ధన్‌రెడ్డి, సర్పంచులు శేఖర్‌రెడ్డి, బాదుల్లా, ఎంపీటీసీ బాషా, నాగేశ్వర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, డమకర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, చంద్రారెడ్డి, ఎల్లారెడ్డి, సుబ్బయ్య, మునయ్య, రాయుడు, సంటయ్య పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

రాయచోటి అర్బన్ : రాయలసీమకు తీరని నష్టం వాటిల్లే అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణంపై శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జనార్దన్ హాజరవుతారన్నారు. సమావేశానికి రైతు సంఘాల నేతలు, రైతులు, మేధావులు, ప్రజాసంఘాల నేతలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ ఆయన పిలుపునిచ్చారు.

నష్టపరిహారం అందించేందుకు చర్యలు

సిద్దవటం : భాకరాపేట- రేణిగుంట జాతీయ రహదారి 716 రోడ్డు ఏర్పాటుకు సంబంధించి జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు కట్టడాలు, భూములు కోల్పోయిన బాధితులకు త్వరితగతిన నష్ట పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టినట్టు తహసీల్దారు శంకర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి గృహాలు, భూములు కోల్పోయిన బాధితుల జాబితాను పరిశీలించి సంబంధిత వీఆర్‌ఓలకు వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు పరిశీలించాలని ఆదేశించామన్నారు. అనంతరం నష్టపరిహారం అందజేస్తామన్నారు.

నివాళి

ఓబులవారిపల్లె : గాదెల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సి.రాజ (40) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సిద్దవటం : మండలంలోని డేగనవాండ్లపల్లె గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు, పార్టీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి సోదరుడు సింగం భాస్కర్‌రెడ్డి(63) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలు గురువారం మృతదేహానికి నివాళులర్పించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఓబులవారిపల్లె : నేడు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

జనాలు లేక లోకేష్ పాదయాత్ర వెలవెల

సిద్దవటం : నారా లోకేష్ పాదయాత్ర జనాలు లేక వెలవెలపోతోందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని మూలపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉపాసి వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి గృహ ప్రవేశానికి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్రలో నారా లోకేష్ వైఎస్ఆర్‌సీపీ నాయకులను తిట్టడం తప్ప చంద్రబాబు పాలనలో ప్రజలకు ఏమి చేశారనేది చెప్పలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి సంక్షేమ పథకాలను సమపాలల్లో ముఖ్యమంత్రి ప్రజలకు అందించిందన్నారు. టీడీపీ పాలనలో ప్రజలకు ఏమి మేలు చేశారో లోకేష్ ప్రజలకు చెప్పాలని ఆయన ప్రశ్నించారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన అన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

స్టేట్ బ్యాంక్ డీజీఎం హేమవి



మాట్లాడుతున్న డీజీఎం హేమవి

లక్కిరెడ్డిపల్లి : ఎస్‌హెచ్‌జీ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధికంగా రుణాలు ఇవ్వనున్నట్టు మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ డీజీఎం హేమవి సూచించారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పొదుపు సంఘాల సభ్యులు, రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీలోనే కాకుండా అగ్రికల్చర్ లోన్‌లు, ముద్ర, పాడి పరిశ్రమ లాంటి రుణాలను స్టేట్ బ్యాంక్ ద్వారా రైతులు పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీ రుణాలతో సంబంధం లేకుండా ఇతర రుణాలు ఇస్తామన్నారు. ఎస్‌హెచ్‌జీ రుణాల ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ రామకృష్ణ, ఛీఫ్ మేనేజర్ సురేష్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నరసింహులు, లక్కిరెడ్డిపల్లి బ్రాంచ్ మేనేజర్ వేణుమాదవ్, కుర్నూతల బ్రాంచ్ మేనేజర్ సాయి కుమార్, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో గంగమ్మ జాతరను జరుపుదాం

చాందినీ బండ్లు ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి : సీఐ వరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 21,22వ తేదీలలో జరిగే గంగమ్మ జాతరను సమిష్టి కృషితో విజయవంతం చేద్దామని సీఐ వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గంగమ్మ జాతరకు సంబంధించి ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు విలేకరులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గంగమ్మతల్లికి మొక్కుబడి ఉన్నవారు చాందినీ బండి ఏర్పాటు చేసుకోవాలంటే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. చాందినీ బండ్లు ఎత్తు 10 అడుగుల లోపే ఉండాలన్నారు. చచాందినీబండ్లు ముందు అశ్లీల నృత్యాలు, రికార్డ్ డ్యాన్సులు, మైక్, సౌండ్ బాక్సులు పెట్టకూడదన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, దొంగతనాలు, మద్యం విక్రయాలు, జూదాలు వంటి అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అక్కడక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, భక్తులు పోలీసులకు సహకరించాలన్నారు. వీఐపీ పాసులు ద్వారా అమ్మవారి దర్శనానికి వెళ్లేవారు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని, ఈ విషయాన్ని గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వినోద్ కుమార్, సర్పంచ్‌లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను బకాయిలను వసూలు చేయండి

- రూ.కోటికిపైగా ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు
- మునిసిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి



రాజంపేట : పురపాలక సంఘం పరిధిలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ.కోటికి పైగా పన్నులు బకాయిలున్నాయని వాటిని వసూలు చేయాలని మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి సిబ్బందికి తెలియజేశారు. గురువారం పురపాలిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ బకాయిలు ఉన్న పన్నులను వందశాతం రాబట్టే విధంగా సంబంధిత శాఖ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులను సంప్రదించి పన్నులు రాబట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పన్నుల బకాయిలు రాబడితే పరోక్షంగా పట్టణాభివృద్ధికి దోహదపడినట్లేనన్నారు. ప్రభుత్వ జీఓ ప్రకారం స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పురపాలికకు రావాల్సిన మొత్తాలను సక్రమంగా వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. దీని ద్వారా గతంలో యేడాదికి రూ.4 లక్షలు వచ్చేదికాదన్నారు. గత నెలలో పురపాలక సంఘానికి రూ.4లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. పన్నుల రాబట్టడంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ముందంజలో ఉండేలా సిబ్బంది కృషి చేసి, మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. సమావేశంలో కమిషనరు జనార్దన్‌రెడ్డి, పురపాలక సంఘం వైస్ చైర్మన్ మర్రి రవికుమార్, సుమియా, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్లల బంగారు భవిష్యత్తుకు పథకాలు



ఎంపికైన మహిళా రక్షణ కమిటీ సభ్యులు

చిట్వేలి : కస్తూర్బా గాంధీ విద్యాలయంలో జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మహిళా రక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్టు ఐసీడీఎస్ రైల్వేకోడూరు ప్రాజెక్టు అధికారిణి రాజేశ్వరి తెలిపారు. గురువారం విద్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల విషయంలో మార్పులు వచ్చినప్పటికీ ఇంకా పలు సమస్యలు చుట్టుముడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల సమాజానికి గర్వకారణం కావాలని, ఆడపిల్ల పుట్టుక కుటుంబానికి అదృష్టంగా భావించాలన్నారు. ఆడపిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అన్నింటా రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1098, 112, 100, 108, 104 వంటి యాప్‌లను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎంఈఓ, వైద్యురాలు, అధ్యాపక సిబ్బంది, మరో ముగ్గురు అమ్మాయిలతో కలిసి రక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్లు అనసూయమ్మ, నిర్మల, సూపర్‌వైజర్లు సుబ్బలక్ష్మి, సుధామణి, అధ్యాపక సిబ్బంది లక్ష్మి, కళ్యాణి, అకౌంటెంట్ భారతి, ఏఎన్‌ఎం నాగలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

బ్లాక్‌చైన్ టెక్నాలజీపై శిక్షణా శిబిరం

రాజంపేట : ఏఐటీఎస్‌లో బ్లాక్‌చైన్ టెక్నాలజీపై బీటెక్ తృతీయ విద్యార్థులకు ఒకరోజు శిక్షణా శిబిరాన్ని గురువారం నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటరింగ్ అసోసియేట్ డైరెక్టర్ రాధిక, ఇన్ఫోరిప్స్ ఎండీ ఎం.కోటేశ్వరరావులు టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్లాక్ చైన్ టెక్నాలజీ అనేది వ్యాపార నెట్‌వర్క్‌లో పారదర్శక సమాచారాన్ని పంచుకోవడానికి అనుమతించే అధునాతన డేటాబేస్ మెకానిజం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనువాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరంట్స్ మీట్ : రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. క్రమశిక్షణతో లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు డా.హేమంత్‌కుమార్, శివరామిరెడ్డి, దొమ్మరాజు కృష్ణమోహన్‌రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థుల విశేష ప్రతిభ





రాయచోటి: పతకాలను అందుకున్న విద్యార్థులు, జాహ్నవిని అభినందిస్తున్న కరస్పాండెంట్ ఈశ్వరయ్య

రాయచోటి : తిరుపతిలో గ్రాండ్ మాస్టర్ నాగూర్ ఆధ్వర్యంలో జరిగిన ఫస్ట్ ఓపెన్ సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో రాయచోటి జెడ్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు గ్రాండ్ మాస్టర్ జాక్ తెలిపారు. జాక్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఈ నెల 12న నిర్వహించిన సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో నాలుగు స్వర్ణ పతకాలు, నాలుగు రజత పతకాలు, 11 కాంస్య పతకాలు సాధించారన్నారు. విద్యార్థులు సౌత్ జోన్ పోటీలలో అసాధారణ ప్రతిభ చాటి రాయచోటి ఖ్యాతిని నలువైపులా విస్తరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ప్రతిభ సాధించిన విద్యార్థులకు పతకాలను అందజేశారు.

సత్తాచాటిన జాహ్నవి

రాజంపేట రూరల్ : సౌత్ జోన్ స్థాయి తైక్వాండో పోటీలలో తమ విద్యార్థి వర్ల జాహ్నవికి స్వర్ణ పతకం రావడం శుభపరిణామమని శ్రీ సాయి నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ నీలి ఈశ్వరయ్య తెలియజేశారు. స్థానిక సాయినగర్‌లోని స్కూల్‌లో గురువారం జాహ్నవికి అభినందన సభ ఏర్పాటు చేశారు. జాతీయ స్థాయి పోటీలలో 5వ తరగతి చదువుతున్న జాహ్నవికి అందించి అభినందనలు తెలియజేశారు. జాహ్నవి తల్లిదండ్రులు రాజేశ్వరి, నరసింహులును, శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ సునీల్‌ను శాలువాతో సత్కరించారు.

క్వారీల అనుమతులు రద్దు చేయండి



మాట్లాడుతున్న గ్రామస్తులు

రామాపురం : మండలంలోని కల్పనాయినిచెరువు గ్రామంలో కంకర మిషన్లకు సంబంధించిన క్వారీలకు ప్రభుత్వం బండలు పేల్చుటకు అనుమతులు మంజూరు చేసిందని, ఆ అనుమతులను రద్దు చేయాలని గ్రామస్తులు కోరారు. స్థానికంగా వారు గురువారం విలేకరులతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. బండరాళ్లను పేల్చడంతో సమీపంలోని పంట పొలాలు, బోర్లు, బావులు దెబ్బతింటున్నాయని, గ్రామాల్లోని ఇళ్లు నెర్రలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీల మధ్యలో సుమారు 50 మంది రైతులు తమ పొలాలను సాగు చేస్తున్నారన్నారు. ఆ గ్రామంలోని కంకర మిషన్ల యజమానులు అవసరమైన బండరాళ్లను క్వారీలను తమ పొలాల్లో వద్ద ఎంపిక చేయడంతో తమ పొలాల్లోని పంటలు సాగు చేసిన పంట చేతికి అందక నష్టపోతున్నామని రైతులు రామయ్య, కృష్ణయ్య, నాగయ్య, గంగయ్య, చిన్న గంగయ్యలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బుధవారం జిల్లా అధికారులు, కంకర మిషన్ యజమానులు గుట్టు చప్పుడు కాకుండా ప్రజాఅభిప్రాయ వేదికను గ్రామస్తులకు తెలియకుండా కొంత మందితో సమావేశం జరిపారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి న్యాయం చేయాలని కోరారు.